క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి



మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన క్రిష్టియన్ మైనార్టీ నేతలు

చిక్కడపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు క్రిష్టియన్ మైనార్టీ సంఘాల నేతలు గురువారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌ను కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి క్రిష్టియన్ మైనార్టీల సమస్యలను ఆయనకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చారని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డి. ఆడమ్‌రాజ్, టీయూసీపీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్, కాంగ్రెస్ నాయకులు భరత్, రాయ్‌డిన్ రాక్ ఉన్నారు.



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తాం : పావని

చిక్కడపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని పార్థివాడ, వివేక్‌నగర్ బస్తీల్లో సీసీ రోడ్ల ఏర్పాటు పనులను త్వరలో ప్రారంభిస్తామని కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ తెలిపారు. గురువారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి ఆమె పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేవిధంగా కూడా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అధికారులు అబ్దుల్ సలామ్, మహేష్, శంకర్, బీజేపీ నేతలు, స్థానికులు వినయ్‌కుమార్, నవీన్, సాయిచంద్, దామోదర్, ఆనంద్‌రావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు

రోడ్డుపై అక్రమ పార్కింగ్‌ను తొలగించాలి

ముషీరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నుంచి బాపూజీనగర్ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం ముషీరాబాద్‌లో కార్పొరేటర్ జీహెచ్ఎంసీ డీఎంసీ రామానుజులరెడ్డి, శానిటేషన్ డీఈ వెంకటేష్, ముషీరాబాద్ పీఎస్ సీఐ రాంబాబు, ట్రాఫిక్ ఎస్ఐ కొండల్ తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముషీరాబాద్‌లో రోడ్డు పక్కన నెలల తరబడి కార్లను పార్కింగ్ చేయడం, చెత్తను సేకరించే ఆటో రిక్షాలను నిలపడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడడంతో పాటు నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. అక్రమ పార్కింగ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని డీఎంసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు ఆయూష్, జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏ గంగాధర్ పాల్గొన్నారు.



వందేమాతరం ర్యాలీలో పాల్గొన్న గౌతమ్‌రావు, ఆనంద్‌గౌడ్ తదితరులు

వందేమాతర గీతం ర్యాలీ

అంబర్‌పేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశభక్తి పెంపొందించడానికి వందేమాతర గీతం స్ఫూర్తిదాయకం అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పేర్కొన్నారు. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో వందేమాతర గీతం ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు శ్రీసరస్వతి విద్యానికేతన్‌లో పాఠశాల విద్యార్థులచే వందేమాతరం గీతాన్ని పాడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం దేశ ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి నింపిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు భిక్షపతి, వర్కాల శ్రీకాంత్, వెంకటస్వామిగౌడ్, రాంచందర్‌గుప్తా, పెంటంరాజు, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్, తిరుపతిగుప్తా, ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వందేమాతరం గీతం ఆలాపన

గోల్నాక : వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా బీజేపీ గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో గల సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో గురువారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, పార్టీ జిల్లా కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, పార్టీ నాయకులు, పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు.

హనుమంతరావుకు ఆత్మీయ సత్కారం



వి.హనుమంతరావును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, నారాయణస్వామి

రాంనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం రోశయ్య స్మారక అవార్డును అందుకున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావుకు కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గ నాయకులు గురువారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, నాయకులు జె.సత్తిబాబు, రామ్మోహన్, వేణుగోపాల్‌యాదవ్, జగన్నాథం, అనిల్‌కుమార్, జహంగీర్, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమానికి ఏడు వరాల ప్రకటన అభినందనీయం

● సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్, కాటమనేని వెంకటేష్‌గౌడ్

రాంనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఏడు వరాలు ప్రకటించడం అభినందనీయం అని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో-కన్వీనర్ కాటమనేని వెంకటేష్‌గౌడ్‌లు పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఏపీ సీఎం మాదిరిగా తెలంగాణ సీఎం దివ్యాంగులకు ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. దివ్యాంగులను విస్మరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో నష్టపోతారని వారన్నారు.



దత్త జయంతి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సాయిమోహన్ తదితరులు



దత్త జయంతి పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకుడు మధుసూదన్‌యాదవ్



సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

● వైభవంగా దత్త జయంతి



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో దత్తజయంతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నల్లకుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక జీవితంలో మానసిక ఒత్తిడిలకు గురవుతున్న వారిలో భక్తిభావం, ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి నెలకొంటుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం నల్లకుంట డివిజన్‌లోని బ్రాహ్మణ హాస్టల్ వీధిలో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీ.హెచ్.సాయిమోహన్ ఆధ్వర్యంలో దత్త జయంతి మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 9.30నుంచి సాయంత్రం వరకు దత్త జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటేష్ దత్త జయంతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహక సంస్థ పక్షాన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దత్త జయంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీ.హెచ్.సాయిమోహన్‌ను ప్రశంసించారు. దత్త జయంతి మహోత్సవంలో పరిసర ప్రాంతాల భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్, నల్లకుంట పోలీస్ స్టేషన్ సీఐ మారుతిప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసరావు, కొంతం గోవర్ధన్‌రెడ్డి గురుస్వామి, బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు విజేందర్‌సాగర్, మూర్తి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో..

చిక్కడపల్లి : చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలోని దత్తాత్రేయ మందిరంలో గురువారం దత్తజయంతిని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా(విశేషపూజ) పంచామృత అభిషేకాలు, మంత్రపుష్పం, అర్చనలు, నివేదన, తీర్థప్రసాద వితరణ, సామూహిక అనఘాదేవి వ్రతాలు జరిగాయి. పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఈసందర్భంగా భక్తులు పెద్దఎత్తున హాజరై ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో దేవనాథం, చైర్మన్ జానకి సుధాకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయంలో కూడా కనులపండువగా దత్తజయంతి కార్యక్రమం ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.

షిరిడీసాయిబాబా ఆలయంలో..

బాగ్‌లింగంపల్లి షిరిడీసాయిబాబా ఆలయంలో గురువారం దత్తజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకడ హారతి, ప్రత్యేక అభిషేకములు, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పల్లకీసేవ ఆలయ వ్యవస్థాపక వైస్‌చైర్మన్ పెద్దోల్ల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్. ధర్మరాజుగౌడ్ పర్యవేక్షణలో జరిగాయి.

సెక్యూరిటీ సర్వీస్‌లో ప్రైవేట్ సెక్యూరిటీలది కీలకపాత్ర



హ్యాపీ సెక్యూరిటీ డే బ్యానర్లు ప్రదర్శిస్తున్న సెక్యూరిటీ గార్డులు



సెక్యూరిటీ గార్డులకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న డా. డీఎస్ రెడ్డి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్స్ ఆస్తులను కాపాడడంలో ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ అధ్యక్షుడు డా. డీఎస్ రెడ్డి అన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ డేను పురస్కరించుకుని గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో సెక్యూరిటీ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చాకచక్యంగా వ్యవహరించిన సెక్యూరిటీ గార్డులు అద్భుతంగా విధులు నిర్వహించిన సెక్యూరిటీగార్డులు, సెక్యూరిటీ సంస్థలకు అవార్డులు, ప్రశంసాపత్రాలను డీఎస్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. నేటి సమాజంలో ప్రైవేట్ సెక్యూరిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్‌ల నుంచి మొదలుకుని ఎయిర్‌పోర్ట్ వరకు ప్రైవేట్, ప్రభుత్వ సెక్టార్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒక కోటి, తెలంగాణ రాష్ట్రంలో నలభై లక్షల పైచిలుకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారని తెలిపారు. అంతేకాండా 200 ప్రైవేట్ సెక్యూరిటీ కంపెనీలు అనేకమందికి ఉపాధి, ఉద్యోగాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్లతోపాటు ప్రజలకు సేవలందిస్తూ అవకాశాలు కల్పిస్తున్న సెక్యూరిటీ కంపెనీలను కూడా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, జీఎన్ జాదవ్ పాల్గొన్నారు. సెక్యూరిటీ గార్డులు పెద్దఎత్తున పాల్గొని హ్యాపీ ప్రైవేట్ సెక్యూరిటీ డే బ్యానర్లు ప్రదర్శించారు.

జమిస్తాన్‌పూర్ గౌడ సంఘం ఎన్నిక చెల్లదు : శ్రీకాంత్‌గౌడ్



కోర్టులో కేసు ఉన్న పత్రాలు చూపిస్తున్న లింగాల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : జమిస్తాన్‌పూర్ గౌడ సంఘం నూతన కమిటీని నిబంధనకు విరుద్ధంగా ఎన్నుకున్నారని, ఈ ఎన్నిక చెల్లదని సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం పార్సిగుట్ట వద్ద గల జమిస్తాన్‌పూర్ గౌడ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ సంఘానికి సంబంధించిన రూ.35లక్షల డబ్బులు సంఘానికి చెందిన కొంత మంది నాయకులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. జరిగిన అవినీతిపై కోర్టులో కేసు కొనసాగుతుందని అలాంటి సమయంలో ఎన్నికలు ఏ విధంగా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. డబ్బుల విషయం తేలే వరకు ఎన్నికలు జరుపవద్దని కోర్టు ఆదేశాలు సహితం ఉన్నాయని అన్నారు. సంఘంలో జరిగిన డబ్బుల అవినీతిపై మాన్ కమిటీ సహితం వేశామన్నారు. కనీసం సొసైటీ సభ్యులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిబంధనకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించారని ఆరోపించారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే నూతన కమిటీని ఏర్పాటు చేశారని విమర్శించారు. నూతన కమిటీలో తమ బంధుమిత్రులను ఎన్నుకుని సొసైటీ సభ్యులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నూతన కమిటీపై నగర పోలీసు కమిషనర్, రిజిస్టర్ కార్యాలయం, సంఘంకు సంబంధిత బ్యాంకులో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు జి.శిరీష్ గౌడ్, ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్, కృష్ణగౌడ్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రఘు పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. - హైదరాబాద్ సిటీ



తెలంగాణ స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లో తడి, పొడి చెత్త వేరు చేసే అవగాహన కార్యక్రమ ర్యాలీ జరిగింది. జీహెచ్ఎంసీ సిబ్బంది భిక్షపతి, రమేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కె.సురేందర్, కె.అనురాధ పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

సినీ ఫక్కీలో పట్టపగలు చోరీ

● బ్యాంకు నుంచి నగదు విత్‌డ్రా చేసుకొని వెళ్తున్న వృద్ధుడు

● వెంబడించి నగదు బ్యాగ్ లాక్కెళ్లిన దుండగుడు

● కేసు నమోదు చేసుకొని సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్న పోలీసులు



నగదు తీసుకుని పరారైన నిందితుడి ఫొటో

కవాడిగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో నుంచి నగదు డ్రా చేసుకొని కారు వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడి చేతిలో నగదు బ్యాగును సినిమా ఫక్కీలో చోరీ చేసిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లో ఉంటున్న రిటైర్డ్ ప్రైవేటు ఉద్యోగి వెంకటేశ్వరరావు(67) గతంలో అశోక్‌నగర్‌లోని కాకతీయ సిమెంట్ సంస్థలో పనిచేసేవాడు. ఈ సమయంలో సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంకులో (అప్పటి ఆంధ్రాబ్యాంక్) ఖాతా తెరిచి రిటైర్‌మెంట్ అవసరాల కోసం డబ్బు జమ చేసుకున్నాడు. ఈ డబ్బును తీసుకునేందుకు గురువారం ఎస్ఆర్‌నగర్ నుంచి తన కారులో అశోక్‌నగర్‌కు వచ్చాడు. బ్యాంకు వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో బ్యాంకు పక్కవీధిలో కారును పార్క్‌చేసి, బ్యాంకులోకి వెళ్లాడు. ఉదయం 11.30గంటల ప్రాంతంలో తన ఖాతాలో ఉన్న రూ.2.50లక్షలు విత్‌డ్రా చేసుకొని చేతి సంచిలో వేసుకొని కారు వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో అతడిని, వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కారు వద్దకు వెళ్లేలోపే చేతిలోని డబ్బుల సంచి లాక్కుని పరారయ్యాడు. బాధితుడు వెంటనే దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న దోమలగూడ డీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. బ్యాంక్ సమీపంలోని సీసీ టీవీల ఫుటేజ్ ద్వారా నిందితుడి ఆచూకీ గుర్తించే పనిలో పడ్డారు. దోపిడికి పాల్పడిన అగంతకుడు ఒక్కడేనా మరెవరైనా అతడికి సహకరించారా అన్న కోణంలో పలు బృందాల ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు దోమలగూడ క్రైం పోలీసులు తెలిపారు.

7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలి

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శేషసాయి



మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్

రాంనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్‌లో శివారు మున్సిపాలిటీలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 7న ఇందిరాపార్కు వద్ద బీజేపీ మహాధర్నాను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆర్.శేషసాయి కోరారు. గురువారం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ సమావేశం డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విలీన నిర్ణయం వల్ల వందలాది గ్రామాలు స్వయం ప్రతిపత్తి కోల్పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోచయ్యయాదవ్, కౌండిన్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి, దర్గా నర్సింగ్‌రావు, ప్రదీప్, స్నేహరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శేషసాయి

గ్రేటర్‌లో విలీనం తగదు

రాంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 7న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురవారం బీజేపీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాగరాజాచారి, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, నాయకులు ఏడెల్లి బాలు, యోగేష్, రమేష్, ధనుంజయ, పాండురంగయ్య, చంద్రశేఖర్, కవిత, షరీఫ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులు పూర్తిచేయాలి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

రాంనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మోహిన్‌చెరువు నాలా పనులను వెంటనే పూర్తిచేయాలని గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలా నిర్మాణానికి జీహెచ్ఎంసీ, ఎస్ఎన్‌డీపీ రూ.6కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకు సగం పనులు మాత్రమే పూర్తై మిగతా పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో ప్రతి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిషనర్‌కు విన్నవించామన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ పనులు పూర్తయ్యేలా ఆదేశిస్తామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.



దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 6న నెక్లెస్ రోడ్‌లో నిర్వహించే దివ్యాంగుల అవేర్‌నెస్ వాక్ పోస్టర్‌ను గురువారం నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, నాయకులు జి.శ్రీనివాస్, నర్సింహారెడ్డి సురేష్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



హిందూమతంపై సీఎం రేవంత్‌రెడ్డి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన ఆ పార్టీ నేతలు ఆనంద్‌గౌడ్, మైలారం రాజు, వెంకటస్వామిగౌడ్, భిక్షపతి, రాజు - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

సీఎం అనుచిత వ్యాఖ్యలు బేషరతుగా ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న బీజేవైఎం నేతలు

చిక్కడపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హిందూ దేవతలను అవమానపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని బీజేవైఎం సెంట్రల్ జిల్లా నేతలు ఆరోపించారు. గురువారం ఖైరతాబాద్‌లో నిరసన నిర్వహిస్తున్న బీజేవైఎం నేతలను కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని చిక్కడపల్లి పీఎస్‌కు తరలించారు. ఈ క్రమంలో దారిమధ్యలో చిక్కడపల్లి లైబ్రరీ వద్ద కూడా వారు నిరసన తెలిపేందుకు యత్నించారు. ఈ సందర్భంగా వారు పీఎస్‌లో కూడా తమ నిరసన తెలిపారు. బీజేవైఎం సెంట్రల్ జిల్లా సీనియర్ నాయకులు పి. అవినాష్, బి. భరత్‌గౌడ్, చక్రవర్తి మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలను సీఎం బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఫణికుమార్, చంటియాదవ్, సాయియాదవ్, శేఖర్, విజయ్ పాల్గొన్నారు.



రాజేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న అరుణ్‌కుమార్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌గా రాజేందర్ నియామకం

రాంనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌గా బీసీ సంఘం సీనియర్ నాయకుడు చెరుకుల రాజేందర్ నియమితులయ్యారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ ఆయనను ప్రకటించి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ బీసీల డిమాండ్ల సాధన కోసం అంకితభావంతో పనిచేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చినందుకు ఎంపీ ఆర్.కృష్ణయ్య, డాక్టర్ ర్యాగ అరుణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.